

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE


సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 79 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 18, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# మాదిగల అస్తిత్వాన్ని కాలరాస్తున్న కాంగ్రెస్






డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాదిగల మణుగడ లేకుండా చేస్తున్నారు
- ఒక ఎంపీ రెండు ఎమ్మెల్యేల స్థానాల్లో మాదిగలు పూర్తిగా మారారు
- ఎన్నికల ముందు లేని కుల వ్యత్యాసం గెలుపొందాక విపరీతంగా పెరిగింది
- అన్ని రంగాల్లో ఆరితేరుతున్న మాదిగలను అణిచివేస్తున్న కాంగ్రెస్
- రాజకీయంగా దూరం చేసి దెబ్బ కొడుతున్నారు
- అధికారం లేకుండా చేసి బోలెడు అక్రమ కేసులు బనాయిస్తున్నారు
- మతోన్మాదుల సరసన చేరుతున్న "ఉమ్మడి వరంగల్ జిల్లా "కాంగ్రెస్
- పంపన్నులకే అవకాశలిస్తూ యువతను పెడచెవిన పెడుతున్నారు
- అక్రమ వ్యాపారాలతో ఆరితేరిపోతున్నోళ్ళను అక్కున చేర్చుకుంటున్నారు
- ఉద్యమ గడ్డపై ఉరుకులాడుతున్న ఊహకందని రాజకీయం : డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ఉద్యమాలను ఆయువుపట్టుగా భావిస్తూ జీవిస్తున్న మాదిగల అస్తిత్వం పూర్తిగా అణిచివేయబడుతుందని డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు.అధికారం కోసం రాత్రికి రాత్రే పార్టీలు మారి టికెట్లు దక్కించుకొని గెలుపొందడం ఒకరకమైన రాజకీయమైతే 40ఏళ్లుగా కాంగ్రెస్ జెండాను పట్టి నిజాయితీగా పని చేసిన కాంగ్రెస్ నాయకులను నిండా ముంచి ఒకేరోజు టికెట్తో కాలం కలిసి వచ్చిన గెలుపు మాదిగ కులాన్ని పాతాళానికి తొక్కే ప్రయత్నం చేస్తుందని తీవ్రంగా విమర్శించారు.నాయకుడు ఎవడైనా ప్రజాక్షేత్రంలో గెలువనంతవరకు నక్కి నక్కీ మెదుగుతూ ఎన్నికల్లో గెలవగానే ఓట్లు వేసి గెలిపించిన మాదిగలను హీనాతి హీనంగా పరిగణిస్తూ వ్యాపారాలకు దూరం చేయడమే కాకుండా ఉద్యోగాల్లో పనిచేయకుండా అణిచివేస్తూ ఆనందం పొందుతున్నారని గుర్తు చేశారు.రాజకీయాల్లో గెలుపొందాలంటే ఇంతలా దిగజారి - మిగతా 2లో..

## డాటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయండి

భూ పరిహారం నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించండి

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



2

## ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్..

నేడు పలువురు దేశాధినేతలతో మోడీ భేటీలు



2

## ఐబొమ్మ రవికి హైకోర్టు నుంచి బెయిల్

2

## తెలంగాణ క్యాబినెట్ సమావేశం 23న.. రైతుభరోసా నిధులపై చర్చ



2




## హామీల అమలులో అస్పృశ్యత

- ఆచరణ సాధ్యం కానీ హామీలతో సంక్షోభంలో ప్రజాసంక్షేమం
- సంక్షేమాలతో ప్రజలను మెప్పించే ప్రభుత్వాలు ఎక్కడ.
- ప్రభుత్వాల ఆదాయం పెరుగుతున్న సంక్షేమల అమలు తగ్గుతుంది.
- కష్ట జీవులైన రైతులను కంటతడి పెట్టిస్తున్న ప్రభుత్వాలు.
- సంక్షేమాల సాకుతో గద్దెనెక్కుతున్న ప్రభుత్వాలు.
- ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్
- కేయూలో ముగిసిన జాతీయ సెమినార్

7

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# డాటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయండి

**భూ పరిహారం నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించండి**

**ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

డాటా సెంటర్లకు వివిధ రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు.. వారికి అవసరమైన భూమి, ఇతర వసతులపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. డాటా సెంటర్లకు భూ కేటాయింపులో హేతుబద్ధత ఉండాలని సీఎం సూచించారు. వివిధ ప్రాంతాల్లో డాటా సెంటర్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సాగుతున్న భూ సేకరణపైనా అధికారులను సీఎం ఆరా తీశారు. భూ పరిహారం నిర్ణయం విషయంలో ఉదారంగా ఉండాలని అధికారులకు సీఎం సూచించారు. రైతులను పిలిచి మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిహారం నిర్ణయించాలన్నారు. రూ.వేల కోట్లతో పెట్టుబడులు పెట్టే సంస్థలు భూమిపై పెట్టే పెట్టుబడి చాలా స్వల్పమన్నారు. కంపెనీలకు సకాలంలో భూమి, ఇతర వసతులు అందుబాటులో ఉంచితే త్వరగా పనులు పూర్తి చేసుకుంటారని సీఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# ఐబొమ్మ రవికి హైకోర్టు నుంచి బెయిల్




**హైదరాబాద్, జైభీమ్ న్యూస్**

సినిమాల పైరసీ కేసులో నిందితుడైన ఇమ్మడి రవి (ఐబొమ్మ రవి)కు తెలంగాణ హైకోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత సంవత్సరం నవంబర్‌లో అరెస్టు అయిన రవికి బెయిల్ ఇస్తూ కోర్టు పలు కఠిన షరతులు విధించింది. హైదరాబాద్ నగరాన్ని వదిలి ఎక్కడికీ వెళ్లకూడదని, సాక్షులను ప్రభావితం చేయడానికి లేదా సాక్ష్యాలను తారుమారు చేయడానికి ప్రయత్నించకూడదని ఆదేశించింది. ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సైబర్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసుల ఎదుట హాజరు కావాలని స్పష్టం చేసింది. తన పాస్‌పోర్టును కోర్టులో అప్పగించాలని, దేశం విడిచి వెళ్లకూడదని కూడా ఆదేశాలు జారీ చేసింది. విచారణలో పూర్తిగా సహకరించాలని షరతు విధించింది. సీసీఎస్‌లో నమోదైన వివిధ కేసుల్లో బెయిల్ కోసం రవి దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కె. సుజన మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను వచ్చే నెల రెండో వారానికి వాయిదా వేశారు.

# రెండేళ్లలో ఏఐ రంగంలో 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశం

**పరిశోధనలు, ఆవిష్కరణలకు ఏఐ మిషన్ 2.0 ప్రారంభం**

**కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన**

**న్యూఢిల్లీ, జై భీమ్ న్యూస్ :**

ముందురానున్న రెండేళ్లలో భారత్‌లో కృత్రిమ మేధ (ఏఐ) సెక్టార్‌లో 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షితమవుతాయని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో మంగళవారం మాట్లాడుతూ.. ఏఐ రంగంలో భారత్ అసాధారణ వృద్ధి సాధిస్తోందని ఆయన అన్నారు. రానున్న రెండేళ్లలో ఐదు ముఖ్యమైన ఏఐ విభాగాల్లో సుమారు 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు. భారత రూపాయల్లో ఇది దాదాపు రూ.18 లక్షల కోట్లకు సమానం. మౌలిక వసతుల నుంచి ఇంధన సాధనాల వరకు ఏఐ అభివృద్ధికి అవసరమైన అన్ని రంగాల్లో అంతర్జాతీయ కంపెనీలు భారత్ పట్ల ఆసక్తి కనబరుస్తున్నాయని చెప్పారు. ఇది దేశ సాంకేతిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత బలపరుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడుల ఆకర్షణలో భారత్‌లో పునరుత్పాదక ఇంధన వనరులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. దేశ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యంలో 51 శాతం శుభ్రమైన ఇంధనం నుంచి వస్తోండటం, డేటా సెంటర్ల నిర్వహణలో భారత్‌ను ముందంజలో నిలబెట్టడానికి దోహదపడుతోందని మంత్రి తెలిపారు. సాంకేతికత కేవలం కొందరి చేతుల్లో మాత్రమే ఉండకుండా సాధారణ ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలో పరిశోధనలు, ఇన్నోవేషన్లకు ప్రాధాన్యత ఇచ్చే 'ఏఐ మిషన్ 2.0'ను లాంచ్ చేయనున్నామని మంత్రి వెల్లడించారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మానవ వనరులను సిద్ధం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ చేసిందన్నారు. ఇండస్ట్రీలు, ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్లతో సమన్వయంతో ప్రస్తుత ఉద్యోగులకు స్కిల్ ట్రైనింగ్ అందించడంతోపాటు కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించనున్నట్లు మంత్రి చెప్పారు. కంప్యూటింగ్ కెపాసిటీని పెంచేందుకు అదనంగా 20,000 జీపీయూలను జత చేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా బాధ్యతాయుతమైన ఏఐ ఉపయోగంపై ఏకాభిప్రాయం కుదిర్చేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

**అదానీ గ్రూప్ భారీ ఏఐ డేటా సెంటర్లపై దృష్టి**

అదానీ గ్రూప్ ముందురానున్న దశాబ్దంలో భారత్ వ్యాప్తంగా పునరుత్పాదక ఇంధనంతో ఆపరేట్ అయ్యే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ల నిర్మాణానికి 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8.3 లక్షల కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా అనుబంధ రంగాలైన సర్వర్ మాన్యుఫ్యాక్చరింగ్, క్లౌడ్ సర్వీసెస్‌లో మరో 150 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, దీంతో భారత్‌లో 250 బిలియన్ డాలర్ల ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్ ఏర్పడుతుందని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ తెలిపారు. ఇప్పటికే గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలతో కలిసి విశాఖపట్నం, హైదరాబాద్, నోయిడా, పుణె లాంటి సిటీల్లో డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. భారత్ ఏఐ టెక్నాలజీని మాత్రమే ఉపయోగించడంతో ఆగకుండా ప్రపంచానికి ఎగుమతి చేసే స్థాయికి పెరగడమే తమ గోల్ అని ఆయన పేర్కొన్నారు. ఈ సెంటర్లలో భారతీయ ఏఐ స్టార్టప్‌లు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ల కోసం స్పెషల్‌గా కంప్యూటింగ్ కెపాసిటీని అలాట్ చేయనున్నట్లు అదానీ గ్రూప్ స్పష్టం చేసింది.

# మాదిగల అస్తిత్వాన్ని కాలరాస్తున్న "కాంగ్రెస్"

మొదటి పేజీ తరువాయి

బతకాల్సిన పరిస్థితిలు తలెత్తబడుతాయని ఎప్పుడూ ఊహించలేదన్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తొర్రూరు జనగాం వర్ధన్నపేట నియోజకవ ర్గాల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ మున్సిపల్ చైర్మన్ పదవులను దక్కించుకోవడానికి ఎంతటి దిగజారుడు రాజకీయాలను ప్రదర్శించిందో రాష్ట్ర ప్రజలందరూ "ఛీ" "కొడుతు"న్నారన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఘన్పూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారుగా ఉండగా గతంలో వరంగల్ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అదే సామాజిక వర్గానికి చెందిన నేతగా ప్రాతినిధ్యం వహించారన్నారు.తర్వాత ఎంపీ పసునూరి దయాకర్ మాదిగ సామాజిక వర్గం నుండి వరంగల్ ఎంపీగా రెండు దఫాలు ప్రాతినిధ్యం వహించిన దాఖలాలు కలవన్నారు.వర్ధన్నపేట నియోజకవర్గంలో 2004 నుండి 2014 వరకు ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారుగా ప్రజాక్షేత్రంలో ఉండగా 2014 నుండి 2023 వరకు ఆరూరి రమేష్ వర్ధన్నపేట ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రాతినిధ్యం వహించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 56 లక్షలకు పైగా మాదిగ సామాజిక వర్గం ఉన్నప్పుడు ప్రస్తుత రాజకీయాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక ఎంపీ స్థానం రెండు ఎమ్మెల్యే స్థానాలలో ఒక్క మాదిగ సామాజిక వర్గం లేకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ కక్ష గడ్డి మాదిగేతర కులాలకు సీట్లిచ్చి గెలిపించుకొని కేవలం మాదిగలను అణిచివేసే విధంగా రాజకీయ పరిపాలన చేయిస్తుండడం సిగ్గుమాలినతనంగా భావిస్తున్నామన్నారు.ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులు బహిరంగంగా సభలపై మాదిగలను అణిచివేస్తామంటూ దుర్మార్గులకన్న హీనంగా పరిగణిస్తూ పలు విధాలుగా దూషిస్తూ రాజకీయ అధికార పదవిని అడ్డం పెట్టుకొని విపరీతమైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండడమే కాకుండా వాళ్ళ అధికార పదవులతో అక్రమ కేసులను బనాయిస్తూ మాదిగల జీవితాలను శాసిస్తుండడం ఎంతటి భయంకరమైన ఎంతటి క్రూరమైన కక్ష సాధింపు చర్యల్లో భాగమో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలతో పాటు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గమనించాల్సి ఉందన్నారు. ఒకవైపు ప్రజా పాలన అంటూనే ఉద్యమాలకు బాటలు వేసి పోరాటాలకు ప్రాణాలర్పించిన మాదిగలను పనికట్టుకొని కక్షకడుతూ అధికార పదవుల కోసం దిగజారుడు రాజకీయాలు చేయడం కాంగ్రెస్ నాయకులకు మాత్రమే సాధ్యమవుతుందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికలన్నాక గెలుపోటములు సహజమని అలాంటిది మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎంపీలు ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు రిజర్వేషన్లలో భాగమైన నియోజకవర్గాలైనప్పటికిని మాదిగ సామాజిక వర్గం పెద్దగా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందలేదన్నది పచ్చి నిజమన్నారు.ఇప్పటి రాజకీయాలను గమనిస్తున్నప్పుడు వరంగల్ ఎంపీ తో పాటు మిగతా రెండు రిజర్వేషన్ నియోజకవర్గాల్లో మాదిగల ప్రాతినిధ్యం లేనందున ఇప్పటినుండే రాజకీయంగా దెబ్బ కొడుతూ విపరీతమైన బెదిరింపులకు పాల్పడుతూ అన్ని పోలీస్ స్టేషన్లో అక్రమంగా కేసులు పెట్టిస్తుండటమే కాకుండా యువత జీవితాలను శాసిస్తున్నారన్నది మాత్రం ముమ్మాటికి నిజమన్నారు.వ్యాపారాలకు మరిగిన నేతలే మాదిగలను అణిచివేస్తున్నారని అధికార దాహం కోసం ఇంతలా దిగజారే ముందు శాసనసభ పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే ముందు ఇంతలా ఎందుకు చెలాయించలేదని గుర్తు చేశారు.అధిష్టానం డైరెక్షన్లోనే మాదిగలను అణిచివేస్తున్నట్లుగా కనిపిస్తుందని తీవ్రంగా విమర్శించారు కొన్ని సందర్భాల్లో ఎన్నికలప్పుడు ఓటర్ల కాళ్ళు మొక్కినంత పనిచేసిన నాయకులు ఇప్పుడు సామాన్య ప్రజలైన, బహుజనులపై రాళ్లురు వ్వించేంత పనిచేస్తున్నారన్నారు.ఉద్యమ గడ్డపై ఉరుకులాడుతున్న రాజకీయాలను చూస్తుంటే రాజకీయ పదవి అనేది ఎవరికి శాశ్వతం కాదనేది పక్క గుర్తుంచుకోవాలని తెలిపారు.అధికార పదవిని ఎంతలా ఆస్వాదిస్తున్నామో ఎంతలా పేద ప్రజలకు సహాయపడుతున్నామో ఎంతలా ప్రజాసేవ పట్ల ఆత్మగౌరవంతో పనిచేస్తున్నామో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని చూసి నేర్చుకోండని హితవు పలికారు.కాంగ్రెస్ సర్కారును గెలిపించడానికి మాదిగలు ఎంతటి భయంకరమైన పోరాటాలకు దిగారో అధికారం చేతికొచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే దాన్ని మరిచిపోయి మానవత్వం లేకుండా ప్రదర్శిస్తుండడం రాజకీయ నాయకులకు కొత్తేమీ కాకపోయినప్పటికిని రాజకీయ పదవులు మాత్రం శాశ్వతం కాదన్నది గుర్తుకు పెట్టుకోవాలన్నారు.ఓడలు బండ్లు.... బండ్లు... ఓడలు అవుతాయన్నది ఎంత నిజమో రాజకీయ పదవి రాజకీయ అధికారం ఎవరికి శాశ్వతం కాదన్నది ముమ్మాటికి నిజమన్నారు.ఆధిపత్యం కోసం ఇంతలా దిగజారుతున్న రాజకీయాలను చూస్తుంటే బలవంతంగా గెలవకపోతే పోయేదేముందో నాయకులకు ఎందుకు అర్థం కావడం లేదన్నారు.ఎన్ని దుర్మార్గపు పనులైన చేసి గెలుపొందుదామనుకోవడంలో ప్రతిభ కలిగిన ప్రభుత్వ అధికారులను బలి చేస్తున్నారన్న సంగతిని మర్చిపోవద్దన్నారు.జనగాం తొర్రూరు వర్ధన్నపేట రాజకీయాల్లో ముష్టి గొడవలు సిగ్గుకరమన్నారు.రాజకీయ పార్టీలు మారి దేశరతుగా మారలేదు అనడం ఎంతటి వికారత్వాన్ని కనపరుస్తుందో ప్రస్తుత రాజకీయ నాయకులు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పార్టీలు వేరైనా ప్రజల కొరకు పనిచేసే ప్రాతినిద్యాన్ని మరువకూడదన్నారు.కేవలం మాదిగలను మాత్రమే రాజకీయంగా దెబ్బతీస్తున్నారు ఆర్థికంగా దెబ్బతీస్తున్నారు అంటూ బాధ వ్యక్తం చేశారు.కోట్ల రూపాయల కుమ్మరిస్తూ ప్రజల మద్దతుతో గెలిచామని డంకా భజన కొట్టుకోవడం వర్ణించలేని సిగ్గుకరమన్నారు.మాదిగలను ఆర్థికంగా అణిచివేయడం కోసం గత ప్రభుత్వం తీసుకొచ్చిన దళిత బందును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్మూలించిందని గుర్తుచేస్తూ వరంగల్ పార్లమెంటు స్థానంలో వర్ధన్నపేట నియోజకవర్గంలో, ఘనపూర్ నియోజకవర్గంలో మాదిగలకు నాయకులు చేసిన మేలేమిటో లిఖితపూర్వకమైన ఆధారాలతో శ్వేత పత్రం విడుదల చేస్తూ నిజాయితీని చాటుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాదిగలకు ఒక్రంగా ఒక్రంగా ఒక్క మంత్రిపదవిచ్చి నిధులు ఆపుతూ మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు.మాదిగలకు కూలి నాలి చేసుకొని కూడా పనులు దొరకలేని దుస్థితికి పలు నియోజకవర్గాలు చేరువవుతున్నాయన్నారు.చివరకు హోటల్స్ లో పనిచేసే కాడ కూడా బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ ,ఛత్తీస్గడ్, రాష్ట్రాల వాళ్లే ఎక్కువగా పాతుకు పోతున్నారని గుర్తు చేశారు.పదవులు సంపాదించుకునే కాడ మాదిగల సహకారం ఎంతో ప్రాధాన్యమైనప్పటికిని ఓట్లు వేయించుకొని గెలుపొంది చివరకు కాలికింద చెప్పుల చూసేస్థితికి అధికారపు అహంకారం పెరిగిపోవడం రాజకీయ నాయకులకు తగదన్నారు.ప్రాణాలకు తెగించైనా ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడంలో మాదిగలకున్న నిష్ఠ మరెవ్వరికి ఉండదన్నారు.గ్రామస్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు ఎక్కడ చూసినా మాదిగలను అ ణిచివేస్తున్నారు తప్ప అభివృద్ధి చేస్తామన్న నాయకుడు ఒక్కడు లేడన్నారు.ఎక్కడ చూసినా అక్రమ కేసులు అక్రమ అరెస్టులు అక్రమ దాడులు అక్రమ బెదిరింపులే తప్ప మాదిగలు బతకాలంటేనే భయం వేసే పరిస్థితులను దగ్గరుండి తయారు చేస్తున్న నాయకులకు రానున్న కాలంలో కచ్చితంగా తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.భూకబ్జా ముఠాలను లంపెన్ గ్యాంగులను చుట్టు తిప్పుకుంటూ రాజ్యమేలుతున్న నాయకులందరూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తూ నీతి పరులంగా చెలమణి అవుతుండడం పదవిని కట్టబెట్టిన ప్రజలు గమనిస్తున్నారని సంగతిని తప్పక గుర్తించాలన్నారు.నాయకుల తరపున వకాల్తా పుచ్చుకుంటున్న అధికారులు పోస్టింగుల కోసం ప్రజల ప్రాణాలను తోడేస్తున్నారన్నది వాళ్లను కాలం బజారుకు ఈడ్చిన రోజున గుర్తుకొస్తుంది అని తెలుపుతూ అప్పుడు వాళ్ళ చుట్టుపక్కలున్న నాయకులందరూ కంటికి కనబడన్న సంగతి ప్రస్తుతం ఓడిపోయిన నాయకులను చూసి నేర్చుకోవాలన్నారు.పార్టీలు మారిన జంపు జిలానిగాల్లను చూసి ఎగిరెగిరి పడుతున్న నాయకుల్లారా వాళ్లు మీ దగ్గరికి వచ్చింది కేవలం మీ అధికార పదవిని వాడుకోవడానికే తప్ప వాళ్ళతో మీకు పెద్దగా ఒరిగేది లేదనేది తప్పకుండా గుర్తించాలన్నారు.వాళ్లు పేద ప్రజలను విదవరాల్లను ముసలోళ్ళను హీనాతి హీనంగా ముంచి అక్రమంగా కబ్జాలు చేస్తున్న సొమ్మును రాజకీయ పార్టీల సమావేశాల కోసం వాడుతున్నారని బయట ప్రచారాలు చేసుకోవడం ఎంతటి సిగ్గుమాలినతనమో ఒకసారి ఆలోచించాలన్నారు.నాయకుల చుట్టూ నకిలీ గాళ్లే తప్ప ఒక్క మేధావి ఒక్క నీతి కలిగిన నాయకులు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.క్యాంప్ ఆఫీసులలో బెదిరింపులు అడ్డగోలు రాజకీయాలకు ఇకనైనా తెరదింపడంటూ హెచ్చరించారు.సమాజంలో గొప్పగా వెలుగొంది ఒక్కసారి ఇంత హీనమైన రాజకీయాలకు పూనుకోవడం చివరకు చరిత్ర హీనతను చవిచూడాల్సి వస్తుందన్న సంగతిని మనం మరిచిన సమాజం గుర్తుచేసే సమయం దగ్గరలోనే ఉంటుందన్న సంగతిని అందరం గుర్తించాలన్నారు.నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే మంచి మనస్తత్వం దృఢ సంకల్పం ప్రతి నియోజకవర్గంలోని శాసనసభ్యులకు పార్లమెంటు సభ్యులకు ఉండాలని గుర్తుచేస్తూ అధికారం కోసం రాజకీయం చేసే రోజుల్లో నుండి ప్రజాసేవ కోసం రాజకీయం చేసే రోజుల్లోనికి రండంటూ పిలుపునిచ్చారు.

# రాష్ట్రపతికి బహిరంగ లేఖ రాయనున్నాం

**పియూశ్ గోయల్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి**

**వరి రైతులకు బోనస్ ఇవ్వకూడదని చెప్పిన లేఖను వెనక్కి తీసుకోవాలి**

**ఆ లేఖపై సంతకం చేసిన కేంద్ర కార్యదర్శిని తొలగించాలి**

**ఈనెల 27న అన్ని రాష్ట్రాల సీఎంలు, ప్రతిపక్ష నేతలతో సమావేశమవుతాం: ఎస్‌కెఎం నేతలు**



**న్యూఢిల్లీ, జై భీమ్ న్యూస్ :**

మార్చి 9న పార్లమెంట్ బడ్జెట్ సెషన్ మళ్లీ ప్రారంభమవుతున్న నేపథ్యంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం ద్వారా భారత వ్యవసాయ రంగాన్ని అప్పగించేందుకు వ్యతిరేకంగా గ్రామాల్లో రైతులతో బహిరంగ సభలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వర్చువల్ ప్రెస్ మీట్‌లో ఎస్‌కెఎం నేతలు విజూ కృష్ణన్, డాక్టర్ సునీలం, రాజేంద్ర క్షీర్‌సాగర్, సత్యవాన్, పి. కృష్ణప్రసాద్ తదితరులు మాట్లాడారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయకూడదని ప్రధానిని ఆదేశించాలని కోరుతూ రాష్ట్రపతికి బహిరంగ లేఖ రాయనున్నామని, దేశ వ్యవసాయం, డైరీ ఇండస్ట్రీలను మల్టీనేషనల్ కంపెనీలకు తాకట్టు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్‌ను పదవి నుంచి తొలగించాలని కూడా ఆ లేఖలో కోరనున్నామని తెలిపారు. దేశ స్వయం సమృద్ధి, సార్వభౌమాధికారాన్ని అప్పగించడానికి వాణిజ్య మంత్రి గోయల్ దేశద్రోహ చర్యలు చేస్తున్నారని వారు ఆరోపించారు.

వరి రైతులకు బోనస్ ఇవ్వకూడదని రాష్ట్రాలకు పంపిన లేఖను కేంద్ర ఫైనాన్స్ మినిస్టర్ నిర్మలా సీతారామన్ వెనక్కి తీసుకోవాలని, ఆ లేఖపై సంతకం చేసిన వ్యవసాయ కార్యదర్శి వి. వుయల్నామ్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. రెట్రోస్పెక్టివ్ జీఎస్టీ చట్టాన్ని సవరించి రాష్ట్రాల పన్ను అధికారాలను పునరుద్ధరించాలని పార్లమెంటును కోరాలని, ప్రస్తుత 33 శాతం బదులు రాష్ట్రాలకు సెస్, సర్‌ఛార్జ్‌తో కలిపి పూల్‌లో 60 శాతం పన్ను వాటా ఇవ్వాలని, రైతులు పండించే అన్ని పంటలకు సి2 ప్లస్ 50 శాతంతో ఎంఎస్పీ అమలు చేయాలని, వ్యవసాయాన్ని ఆధునీకరించేందుకు వనరుల అభివృద్ధి చేయాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 27న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులతో ఎస్‌కెఎం ప్రతినిధులు భేటీ అవుతారని వారు వెల్లడించారు.

# అంబాల జడ్పీహెచ్ఎస్‌కు ఐడిబిఐ బ్యాంక్ చేయూత







### గ్రామీణ విద్యాభివృద్ధికి విద్యార్థులకు ఫర్నిచర్ పంపిణీ

**కమలాపూర్, 17 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ఐడిబిఐ బ్యాంక్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు అవసరమైన ఒక బీరువా, నాలుగు టేబుళ్లు, మూడు బుక్ షెల్ఫ్‌లను బ్యాంక్ ప్రతినిధులు అందజేశారు. ఈ సదుపాయాలు విద్యార్థులకు చదువుకు అనుకూల వాతావరణం కల్పించడంలో ఉపయోగపడనున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐడిబిఐ బ్యాంక్ హనుమకొండ బ్రాంచ్ మేనేజర్ సుష్మ రామరాజు మాట్లాడుతూ, బ్యాంక్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల భాగంగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సౌకర్యాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునేలా చేయడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పాఠశాలల అభివృద్ధికి ఐడిబిఐ బ్యాంక్ సహకారం కొనసాగుతుందని చెప్పారు. గ్రామ సర్పంచ్ కుమార స్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్‌ను అందజేసిన ఐడిబిఐ బ్యాంక్ అధికారులకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచడమే కాకుండా పాఠశాల అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసచార్య మాట్లాడుతూ, పాఠశాలకు అత్యవసరంగా అవసరమైన సమయంలో బ్యాంక్ ముందుకు వచ్చి సహాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులు అందించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ నాగరాజు, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, సంపత్, స్వరూప భారతి, అంజుమ్, లక్ష్మి, రజిత, శ్రీలత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, వార్డ్ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఐడిబిఐ బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సరిహద్దులు దాటిన అనుబంధం...

### ముత్తాత సమాధి కోసం విదేశం నుంచి హైదరాబాద్‌కు వచ్చిన బ్రిటిష్ పౌరుడు



**హైదరాబాద్, 17 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఏకంగా 130 ఏళ్ల క్రితం సికింద్రాబాద్‌లో మరణించిన తన ముత్తాత సమాధిని కనుగొనాలనే సంకల్పంతో ఇంగ్లండ్‌కు చెందిన బ్రిటిష్ పౌరుడు రాబిన్ డిక్సన్ దాదాపు 19 సంవత్సరాల పాటు అన్వేషణ సాగించి, చివరికి తన లక్ష్యాన్ని సాధించారు. పూర్వీకుడి సమాధి వద్ద నివాళులు అర్పిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబానికి చెందిన పాత దస్త్రాలు పరిశీలించే క్రమంలో తన ముత్తాత చార్లెస్ విల్సన్ బ్రిటిష్ ఇండియాలో పనిచేసి హైదరాబాద్‌లో మరణించారని రాబిన్ డిక్సన్ తెలుసుకున్నారు. చార్లెస్ విల్సన్ 1880లో బ్రిటిష్ సైన్యంలో చేరి బెంగళూరు, మద్రాసు ప్రాంతాల్లో విధులు నిర్వహించి, అనంతరం సికింద్రాబాద్ రెజిమెంట్‌లో లెఫ్టినెంట్‌గా పనిచేశారు. అనారోగ్యంతో 1906 ఆగస్టు 4న తిరుమలగిరి ఆసుపత్రిలో మరణించారు. ముత్తాత సమాధి స్థలాన్ని గుర్తించేందుకు రాబిన్ డిక్సన్ బెంగళూరు, చెన్నై, సికింద్రాబాద్ నగరాల్లో పాత సైనిక రికార్డులు, చర్చిలు, శ్మశాన వాటికల వివరాలు సేకరిస్తూ అన్వేషణ కొనసాగించారు. ఈ క్రమంలో స్థానిక పాత్రికేయుడు రవిరెడ్డి సహకారంతో సికింద్రాబాద్ తిరుమలగిరి 'సెమెట్రీ--12'లో సమాధిని గుర్తించారు. సమాధి గుర్తించిన విషయం తెలిసిన వెంటనే రాబిన్ డిక్సన్ తన భార్య లిన్‌తో కలిసి ఇంగ్లండ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చి, సమాధిపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. "ఈ క్షణం కోసమే ఎన్నేళ్లుగా ఎదురుచూశాను" అని ఆయన భావోద్వేగంతో తెలిపారు. దాదాపు శతాబ్దానికి పైగా కాలం గడిచినా కుటుంబ అనుబంధం ఎంత బలంగా ఉంటుందో ఈ ఘటన మరోసారి తెలియజేసిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## తెలంగాణ అస్థిత్వ శిఖరం కేసీఆర్

### కేయు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు




**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) జన్మదిన వేడుకలను కాకతీయ విశ్వవిద్యాలయం బీఆర్ఎస్వీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్వీ కేయు ఇంచార్జి జెట్టి రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, యూనివర్సిటీ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, పట్టుదల కారణంగానే తెలంగాణ జాతిపితగా ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని భావించి రెండు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చారని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే నివేదికలు, కాగ్ నివేదికలు, నీతి ఆయోగ్ సహా పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తెలంగాణ అభివృద్ధిని గుర్తించాయని వారు పేర్కొన్నారు. కేసీఆర్ పాలనపై దుష్ప్రచారం చేస్తున్న రాజకీయ నాయకులు వాస్తవాలను గుర్తించి తమ వైఖరిని మార్చుకోవాలని వారు సూచించారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రజల ఆశయాలు నెరవేర్చాలంటే కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ బీఆర్ఎస్వీ నాయకులు కందికొండ తిరుపతి, గొల్లపల్లి వీరు, పిన్నింటి విజయ్ కుమార్, పస్తం అనిల్, మహేష్, ఇస్మాయిల్, కార్తీక్, నల్లతీగల శ్రీకాంత్, సాయికుమార్, శివ, సాయి, వేణు, అఖిల్, అజయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ ఫిక్స్డ్ డిపాజిట్లపై ప్రభుత్వం కన్ను?

### ఏబీవీపీ ఆందోళన హెచ్చరిక




**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కాకతీయ విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఫిక్స్డ్ డిపాజిట్ల అంశంపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ఫిక్స్డ్ డిపాజిట్ల వివరాలను ప్రభుత్వం అడగడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఉన్నత విద్యాసంస్థల స్వతంత్రతకు భంగం కలిగే చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అంశంపై విశ్వవిద్యాలయాల వైస్‌చాన్సలర్లు, సీనియర్ ప్రొఫెసర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో వెనక్కి తగ్గకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. గత రెండేళ్లుగా పరిపాలిస్తున్న ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థుల ఫీజుల ద్వారా వచ్చిన నిధులను వినియోగించే విధానంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో దాదాపు 80 శాతం బోధన సిబ్బంది ఖాళీలు ఉన్నాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యం వల్ల ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలకు కేటాయించే బ్లాక్ గ్రాంట్లను విడుదల చేయడం లేదని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల రెగ్యులరైజేషన్‌పై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కాకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ ఏబీవీపీ అధ్యక్షుడు ఉబ్బటి హరికృష్ణ, తెలంగాణ విశ్వవిద్యాలయాల ప్రతినిధి అంబాల కిరణ్, వరంగల్ మహానగర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆగపాటి రాజకుమార్, డాక్టర్ నిమ్మల రాజేష్, విద్యార్థి నాయకులు అఖిల్, సాయికుమార్, క్రాంతి, వీక్షిత, సరయు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బేటి బచావో-బేటి పడావో క్యాలెండర్ల ఆవిష్కరణ




**వరంగల్, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

మామునూరు ఏసిపి కార్యాలయంలో మంగళవారం ఆరు మండలాల పరిధిలోని ఎస్‌హెచ్‌ఓల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్ఎంఎం సాంఘిక సేవ సమితి, ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్, ఉమెన్ హబ్ మరియు సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో "బేటి బచావో--బేటి పడావో" క్యాలెండర్లను ఆవిష్కరించారు. అలాగే "ఆడపిల్లను రక్షిద్దాం -- ఆడపిల్లలను చదవనిద్దాం" పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏసిపి ఎన్. వెంకటేష్ మాట్లాడుతూ బాలికల సంరక్షణ మరియు విద్యపై సమాజంలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి తల్లిదండ్రులు, ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని ఎస్‌హెచ్‌ఓలను కోరారు. ఆడపిల్ల చదువు కుటుంబానికే కాక దేశానికి గర్వకారణమని, బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా పోలీసు శాఖ, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలని సూచించారు. చైల్డ్ ట్రాఫికింగ్‌ను నిరోధించడం అందరి బాధ్యత అని పేర్కొంటూ, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్యకు ఆటంకం కలిగించే సమస్యలను తొలగించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్, గీసుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. విశ్వేశ్వర్, ఏనుమాముల సర్కిల్ ఇన్స్పెక్టర్ జీవాడి సురేష్, ఏసిపి ఈ. శ్రీనివాస్, ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ వరంగల్ మండల కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్, హనుమకొండ జిల్లా మహిళా సాధికారత సంస్థ (ఉమెన్ హబ్) కోఆర్డినేటర్ మానస, సఖి వన్ స్టాప్ సెంటర్ సోషల్ వర్కర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

## తొలి రోజే రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో సత్తా చాటిన వరంగల్ కమిషనరేట్

### జి. మౌనికకు 10 కిలోమీటర్ల పరుగులో గోల్డ్ మెడల్



**వరంగల్, 17 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రారంభమైన నాల్గవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారులు తొలి రోజే విశేష ప్రతిభ కనబరిచారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలి రోజునే మొత్తం 11 పతకాలు సాధించి తమ సత్తా చాటారు. ఈ పతకాలలో ఒక గోల్డ్, ఐదు సిల్వర్, నాలుగు బ్రాంజ్ పతకాలు ఉన్నాయి. ఆర్మడ్ విభాగంలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ గుగులోత్ మౌనిక 10 కిలోమీటర్ల పరుగుపందెంలో అద్భుత ప్రదర్శన చేసి వరంగల్ కమిషనరేట్‌కు తొలి స్వర్ణ పతకాన్ని అందించారు. సిల్వర్ పతకాలను ఆర్మ్ రెజ్లింగ్‌లో హెడ్ కానిస్టేబుల్ సుజాత, మహిళా కానిస్టేబుళ్లు రమ్య, యం. కళ్యాణి, ఫ్రీ రెజ్లింగ్ విభాగంలో కానిస్టేబుల్ కొండా నవీన్, జావెలిన్ త్రోలో మహిళా కానిస్టేబుల్ యం. లత గెలుచుకున్నారు. అలాగే బ్రాంజ్ పతకాలను 40 కిలోమీటర్ల సైక్లింగ్‌లో ఎస్.ఐ సాయి దివ్య, ఆర్మ్ రెజ్లింగ్‌లో మహిళా కానిస్టేబుల్ ఎన్. మౌనిక, 1500 మీటర్ల పరుగులో మహిళా కానిస్టేబుల్ ఎస్. రవళి, రెజ్లింగ్‌లో కానిస్టేబుల్ జె. సతీష్ సాధించారు. అదనంగా 4ఐ400 మీటర్ల రిలే పరుగులో హెడ్ కానిస్టేబుల్ ఎన్. సుజాత, మహిళా కానిస్టేబుళ్లు ఎస్. రవళి, జి. మౌనిక, జె. పావనిల బృందం మరో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ క్రీడాకారులను అభినందిస్తూ, తొలి రోజే అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం గర్వకారణమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి వరంగల్ కమిషనరేట్‌కు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమం ఈరోజు ఉదయం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అన్యువల్ స్పోర్ట్స్ డే బహుమతి ప్రధానోత్సవం

**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వార్షిక క్రీడోత్సవం సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల స్పోర్ట్స్ ఇంచార్జ్ తూర్పాటి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థినులకు మానసిక ఉల్లాసం, ఉత్సాహం, ధైర్యం కలిగించడంతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థి జీవితంలో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. భిక్షాలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళాశాల విద్యార్థినులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ యూనివర్సిటీ తరపున రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ఈసారి కూడా వివిధ క్రీడా విభాగాల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించారు. ఈ క్రీడోత్సవంలో త్రోబాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, రన్నింగ్ తదితర పోటీలను నిర్వహించినట్లు స్పోర్ట్స్ ఇంచార్జ్ తూర్పాటి వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అకాడమిక్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ అర్చన, సురేందర్, కిరణ్, వైష్ణవి, యశస్విని, వీణ, దీప్తి, రచన, శ్రీజ, పూర్ణచందర్ పాల్గొన్నారు. అలాగే కళాశాల సూపరింటెండెంట్ వీరునాయక్, నాన్ టీచింగ్ సిబ్బంది యాదగిరి, సుమన్, సాయి చాగంటి శ్రీనివాస్, జ్యోతి, లావణ్య, చైతన్య, తాజ్ బాబా తదితరులు




హాజరయ్యారు. క్రీడా పోటీల నిర్వహణలో శివ, శ్రీరామ్, భార్గవి కోచ్‌లుగా వ్యవహరించారు. ప్రతి క్రీడకు ఫైనల్ ఇయర్ విద్యార్థినులు శివాని, అక్షయ విజయలక్ష్మి, శ్రావ్య, తనిష్క సాహిత్య, శ్రీహర్షిణి, అక్షయ, చిన్మయి తదితరులు కోఆర్డినేటర్లుగా సేవలందించారు. విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం కార్యక్రమం ముగిసింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# వైద్య ఆరోగ్యశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్ ఘన ఆవిష్కరణ



**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన డైరీ మరియు క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. హనుమకొండలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఎ. అప్పయ్య మరియు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొని డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీల్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పలువురు అధికారులు, సంఘం ప్రతినిధులు, సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో సంఘం కార్యకలాపాలు, గతంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు, అధికారుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న గెజిటెడ్ అధికారుల మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సేవా రంగంలో సమిష్టి కృషి ఉంటేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించగలమని అన్నారు. సంఘం తరపున నిర్వహిస్తున్న కార్యక్రమాలు అధికారుల మధ్య ఐక్యతను పెంపొందించడమే కాకుండా శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా మార్చడంలో సహాయపడుతున్నాయని తెలిపారు. 2026 సంవత్సరానికి విడుదల చేసిన డైరీ, క్యాలెండర్‌లో శాఖకు సంబంధించిన ముఖ్యమైన తేదీలు, పరిపాలనా సమాచారం, సేవలకు ఉపయోగపడే మార్గదర్శకాలు పొందుపరచడం జరిగిందని నిర్వాహకులు వివరించారు. ఇవి అధికారుల రోజువారీ కార్యాచరణకు మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, డాక్టర్ ప్రభుదాస్, పరిపాలన అధికారి కోలా రాజేష్ కుమార్, సంఘం బాధ్యులు వి. అశోక్ రెడ్డి, నెహ్రూ చంద్, చంద్రశేఖర్, విజయలక్ష్మి, ప్రసన్న కుమార్, అనిల్ కుమార్, మాధవ రెడ్డి, వెంకట్రాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు సంఘం కార్యక్రమాలను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది. చివరగా సంఘం ప్రతినిధులు హాజరైన అతిథులకు కృతజ్ఞతలు తెలుపుతూ, వైద్య ఆరోగ్యశాఖ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసు: ఒకరికి జైలు శిక్ష, 15 మందికి జరిమానా




**వరంగల్, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 16 మంది వ్యక్తులను మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ చర్యలు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్, అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణల పర్యవేక్షణలో నిర్వహించబడ్డాయి. పట్టుబడిన వారిని మేజిస్ట్రేట్ రాజ్ నిధి, స్పెషల్ జేఎఫ్‌సీఎం, నాలుగవ అదనపు జేఎఫ్‌సీఎం సివిల్ జడ్జి, వరంగల్ ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం రామచంద్రపురం, వరంగల్‌కు చెందిన బార్ల రాజు (తండ్రి బుచ్చయ్య)కు ఒక రోజు జైలు శిక్ష విధించి హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. మిగిలిన 15 మందికి మొత్తం రూ.19,600 జరిమానా విధించారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత సూచించారు.

## మైనార్టీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల ఆహ్వానం

**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా ప్రీమెట్రిక్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026--27 విద్యాసంవత్సరానికి గాను మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రీమెట్రిక్ సంక్షేమ అధికారి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వార్ స్త్రఎజుతీవఅర్వశ్రీఖఅస్త్రుఖఋ.ఎన్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 5వ తరగతి నుండి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, 9వ మరియు 10వ తరగతుల విద్యార్థులు గత విద్యాసంవత్సరపు ఫలితాల ఆధారంగా అర్హత పొందుతారని అధికారులు వివరించారు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం ప్రభుత్వం నిర్ణయించిన పరిమితిలో ఉండాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జనవరి 16, 2026 నుండి ఫిబ్రవరి 28, 2026 వరకు కొనసాగుతుందని, అనంతరం ఏప్రిల్ చివరి వారంలో వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించి, మే నెలలో ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆదాయ ధృవీకరణ పత్రం, గత తరగతి మార్కుల మెమో, బ్యాంక్ ఖాతా వివరాలు, నివాస ధృవీకరణ పత్రం తదితర పత్రాలను అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలకు జిల్లా ప్రీమెట్రిక్ సంక్షేమ కార్యాలయం, హనుమకొండను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

## ఏసుప్రభు మళ్లీ బతికిస్తాడని మృతదేహాన్ని నాలుగు రోజుల పాటు ఇంట్లోనే ఉంచిన ఘటన

### కూకట్‌పల్లిలో కలకలం

**హైద్రాబాద్, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

మూఢనమ్మకాల కారణంగా కుటుంబ సభ్యులు మృతదేహాన్ని నాలుగు రోజుల పాటు ఇంట్లోనే ఉంచి ప్రార్థనలు చేసిన ఘటన హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి ప్రాంతంలో వెలుగులోకి వచ్చి స్థానికంగా కలకలం రేపింది. అనారోగ్యంతో మరణించిన మహిళ మళ్లీ బతికేస్తుందనే నమ్మకంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేయకుండా మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచడం ఆందోళన కలిగించింది. వివరాల ప్రకారం, కూకట్‌పల్లి లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న శైలజ (43) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించింది. అయితే ఆమె మరణాన్ని అంగీకరించలేని కుటుంబ సభ్యులు, ముఖ్యంగా తల్లి శమంతకమణి మరియు తోబుట్టువులు సునీత, జయరాం, ఏసుప్రభు కృపతో ఆమె మళ్లీ బతికేస్తుందనే విశ్వాసంతో మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి నిరంతరం ప్రార్థనలు చేస్తూ ఉన్నారు. నాలుగు రోజుల పాటు వారు బయటకు చెప్పకుండా ఇంట్లోనే ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిసింది. రోజులు గడుస్తుండటంతో మృతదేహం నుంచి దుర్వాసన రావడం ప్రారంభమైంది. దీనిని గమనించిన అపార్ట్‌మెంట్‌లోని ఇతర నివాసితులు కుటుంబ సభ్యులకు విషయం చెప్పి వెంటనే అంత్యక్రియలు నిర్వహించాలని సూచించారు. అయితే కుటుంబ సభ్యులు వారి మాట వినకపోగా, కొందరితో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కుటుంబ సభ్యులను ఓర్పుతో మాట్లాడి మృతదేహాన్ని ఎక్కువసేపు ఇంట్లో ఉంచడం ఆరోగ్యపరంగా ప్రమాదకరమని వివరించి ఒప్పించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కైకలూరు ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఘటన మూఢనమ్మకాల ప్రభావం ఎంతవరకు ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తుందో మరోసారి చూపించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. అలాగే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.

## బయోఏషియా-2026లో కాకతీయ విశ్వవిద్యాలయం చురుకైన భాగస్వామ్యం




**హైద్రాబాద్, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు బయోఆసియ --2026 తొలి రోజు కార్యక్రమాల్లో కాకతీయ విశ్వవిద్యాలయం చురుకుగా పాల్గొంది. విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, ఫార్మసీ విభాగ డీన్ ఆచార్య ఎన్. ప్రసాద్ ప్రపంచవ్యాప్తంగా హాజరైన నాలుగు వేలకుపైగా ప్రతినిధులతో కలిసి సదస్సు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సంవత్సరం సదస్సు థీమ్ "టెక్‌బయో అన్‌లీష్డ్: ఎఐ, ఆటోమేషన్ అండ్ ది బయాలజీ రేవల్యూషన్" నేపథ్యంలో జీవశాస్త్ర రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయం విద్యా--పరిశోధనా కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నట్లు ఆచార్య ప్రతాప్ రెడ్డి తెలిపారు. జీవశాస్త్రం, కృత్రిమ మేధస్సు సమ్మేళనాన్ని ప్రత్యక్షంగా అవగాహన చేసుకోవడం ద్వారా కాకతీయ విశ్వవిద్యాలయాన్ని 'టెక్‌బయో' ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఎఐ ఆధారిత ఔషధ అన్వేషణ (ఎఐ డ్రివన్ డ్రగ్ డిస్కవరీ) రంగంలో ముందుండే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. సదస్సులో జరిగిన చర్చలు, ముఖ్యంగా ఆటోమేషన్ మరియు బయోటెక్నాలజీ అనుసంధానంపై విశేష అవగాహనను అందించాయని ఆయన తెలిపారు. అలాగే సదస్సులో పాల్గొన్న మూడు ప్రముఖ బయోటెక్ సంస్థలతో విద్యార్థుల ఇంటర్న్‌షిప్ అవకాశాలపై ప్రాథమిక స్థాయి చర్చలు ప్రారంభించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో అవసరమైన ఆధునిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఇది కీలక అడుగుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. బయోఏషియా -- 2026 తొలి రోజునే కాకతీయ విశ్వవిద్యాలయం చురుకైన భాగస్వామ్యం సంప్రదాయ విద్యా పరిమితులను దాటి పరిశ్రమలతో అనుసంధానాన్ని బలోపేతం చేసే దిశగా ఉన్నట్లు విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులకు ఇది మార్గం సుగమం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సంక్షేమాన్ని బహుముఖ దృష్టితో పరిశీలించాలి : ఆచార్య వి. రామచంద్రం




**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

సంక్షేమాన్ని కేవలం రాజకీయ కోణంలో కాకుండా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిమాణాల్లో సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకేనేని వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు "పోపులిస్ట్ పాలసీస్ ఇన్ పోస్ట్ లైబరలైజేషన్ ఇండియా" ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశం ఒక వెల్ఫేర్ స్టేట్ అని గుర్తుచేసిన ఆయన, సంక్షేమం రాజ్యాంగ హక్కులలో అంతర్భాగంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేసిన పలు సంక్షేమ పథకాల ప్రాధాన్యతను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య ఎన్. సుకుమార్ మాట్లాడుతూ, సంక్షేమం దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహంలో భాగంగా ఉండాలని పేర్కొన్నారు. సంక్షేమ చర్యలు బాధ్యతాయుతంగా అమలవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్పొరేట్ రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలతో పోలిస్తే ప్రజలకు అందించే సంక్షేమ ప్రయోజనాలు పరిమితంగా ఉన్నాయని, అవి ఎక్కువగా కనీస అవసరాలకే పరిమితమవుతున్నాయని అన్నారు. రాజకీయ పార్టీలు దీర్ఘకాల ప్రజాహిత దృష్టికోణంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రముఖ మాసపత్రిక "వీక్షణం" సంపాదకులు ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఉచితాలు, సంక్షేమ పథకాలు పాలకుల దయాదాక్షిణ్యాలు కాకుండా ప్రజల హక్కులని స్పష్టం చేశారు. మితిమీరిన జనాకర్షక పథకాలు సముచితం కాదని, రాజ్యాంగబద్ధ సంక్షేమం సమాజాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. సదస్సు సందర్భంగా సెమినార్ పత్రాల సంచికను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యు.జి.సి. కోఆర్డినేటర్ ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు డాక్టర్ గడ్డం కృష్ణతో పాటు పలువురు బోధనా సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఆచార్యులు పాల్గొన్నారు.

## కొత్తకొండలో శ్రీ కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయంలో అమావాస్య రోజు విశేష పూజలు, చండీహోమం




**భీమదేవరపల్లి, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

శ్రీ కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయంలో ప్రతి నెల అమావాస్య సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఈ నెల కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వీరభద్ర స్వామివారికి భస్మాభిషేకం, అమ్మవారికి నిత్యాహ్నిక పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా రుద్ర సహిత చండీహోమాన్ని నిర్వహించారు. ఈ నెల అమావాస్య మంగళవారం రోజున రావడంతో అమ్మవారిని మంగళ చండికగా ప్రత్యేకంగా ఆరాధించారు. హోమంలో పాల్గొనే భక్తులు శత్రు, రోగ, రుణ బాధల నుండి విముక్తి పొందుతారని మార్కండేయ పురాణంలో పేర్కొన్న విధంగా సప్తశతి హవనాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## తెలంగాణ తల్లి గోస తీర్చిన ధీరుడు కేసీఆర్ - దాస్యం వినయ్ భాస్కర్

**వరంగల్, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) 72వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యం వహించారు. మొదటగా వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ గారి గోత్రనామాలతో వారి కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు జరిపి, రాష్ట్ర ప్రజల సుభిక్షం, శాంతి కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం దేవాలయం వద్ద ఉన్న నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ పాల్గొని కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. ఈ సందర్భంగా సామాజిక బాధ్యతగా ఇద్దరు నిరుపేద విద్యార్థుల విద్యా ఫీజులను చెల్లించి, వారికి రసీదులను అందజేశారు. అలాగే దివ్యాంగులు నిర్వహించిన కేసీఆర్ జన్మదిన కార్యక్రమంలో కూడా పాల్గొని వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణ తల్లి గోస తీర్చిన ధీరుడు కేసీఆర్ అని కొనియాడారు. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. 14 సంవత్సరాల స్వరాష్ట్ర పోరాటం, అనంతరం 10 సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని అన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలితాలు అందాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేసీఆర్ దీర్ఘాయుష్షుతో ఉండాలని, రాష్ట్ర ప్రజలకు మరింత సేవలు అందించాలని ప్రార్థనలు చేశారు.

# ఆహార నాణ్యత ప్రమాణాలపై కఠిన తనిఖీలు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాలు**

**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో ప్రజలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, హాస్టల్స్, తినుబండార కేంద్రాలపై ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసేలా సంయుక్త తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి తదితరులు పాల్గొన్నారు. ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, పౌర సరఫరాలు, జిల్లా పంచాయతీ, మిషన్ భగీరథ, విద్యాశాఖలకు చెందిన అధికారులు సమావేశంలో పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి బ్రహ్మాజీ జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీలు, జారీ చేసిన లైసెన్సులు, నమోదు చేసిన కేసులు, తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించారు. ఈ నివేదికపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, తనిఖీలను మరింత కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, హాస్టల్స్‌పై ఫుడ్ సేఫ్టీ మరియు మున్సిపల్ అధికారుల సంయుక్త బృందాలతో వారానికి కనీసం మూడు రోజులు తనిఖీలు నిర్వహించాలని స్పష్టంగా ఆదేశించారు. ప్రతి వారాంతంలో నిర్వహించిన తనిఖీల వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. ఆహార పదార్థాల నాణ్యత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలని, ట్రేడ్ లైసెన్సులు, ఖీూూ× లైసెన్సులు చెల్లుబాటు అయ్యేలా ఉన్నాయా లేదా అనేది తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. లైసెన్సులు లేని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హోటళ్లు, హాస్టల్స్‌లో ఉపయోగించే తాగునీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆర్ఓ వాటర్ ప్లాంట్ల పనితీరును తరచుగా తనిఖీ చేయాలని, అవసరమైతే నీటి నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించాలని తెలిపారు. అదేవిధంగా వంటగదులు, నిల్వ గదులు, ఆహార పదార్థాల నిల్వ విధానం, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను కూడా సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ఆహార పదార్థాలు విక్రయించే స్ట్రీట్ వెండర్లు తప్పనిసరిగా అనుమతులు, లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయించేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా హోటళ్లు, తినుబండార కేంద్రాలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, అవసరమైతే ఆహార నమూనాలను పరీక్షలకు పంపాలని అధికారులకు సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఫుడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్ అలీ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# డాక్టరేట్ పొందిన కడుదుల ప్రసున

**ఔషధ మొక్కలపై పరిశోధనకు పీహెచ్‌డీ డిగ్రీ సాధించిన కడుదుల ప్రసున**

**హన్మకొండ, ఫిబ్రవరి 17, 2026 (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం జూలజీ విభాగానికి చెందిన పరిశోధకురాలు కడుదుల ప్రసున పీహెచ్‌డీ డిగ్రీకి అర్హత సాధించినట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. "ఇవాల్యుయేషన్ ఆఫ్ ఆంటీ-వెనమ్ ప్రాపర్టీస్ ఆఫ్ సెలెక్టెడ్ మెడిసినల్ ప్లాంట్ ఎక్స్‌ట్రాక్ట్స్ " అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధన థీసిస్‌ను విశ్వవిద్యాలయం ఆమోదించడంతో జూలజీ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్.డి) డిగ్రీకి అర్హత పొందినట్లు పేర్కొన్నారు. ఈ పరిశోధనలో విషప్రభావాలను తగ్గించే సామర్థ్యం కలిగిన కొన్ని ఔషధ మొక్కల సారాలపై శాస్త్రీయంగా విశ్లేషణ జరిపినట్లు తెలిసింది. జీవశాస్త్రం, వైద్యరంగానికి ఉపయుక్తమయ్యే విధంగా ఈ పరిశోధన ఉపయోగపడుతుందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. ఈ పరిశోధనను కాకతీయ విశ్వవిద్యాలయం జూలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వై. ప్రమీలాదేవి (విరమణ) పర్యవేక్షణలో నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. పరిశోధన కాలంలో అవసరమైన ప్రయోగాలు, శాస్త్రీయ విశ్లేషణలు పూర్తి చేసి, విశ్వవిద్యాలయం నిబంధనల ప్రకారం థీసిస్‌ను సమర్పించి విజయవంతంగా పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. కడుదుల ప్రసున సాధించిన ఈ విజయానికి విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సహచర పరిశోధకులు అభినందనలు తెలియజేశారు. ఆమె పరిశోధన భవిష్యత్తులో ఔషధ రంగం మరియు జీవశాస్త్ర పరిశోధనలకు ఉపయోగపడే అవకాశముందని వారు అభిప్రాయపడ్డారు.

# ఆరోగ్య మహిళా క్లినిక్‌లు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై డీఎంహెచ్ఓ తనిఖీలు





**పర్వతగిరి, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మంగళవారం పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గీసుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎల్కుర్తిలోని ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్‌లు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బంది నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నివేదికలను పరిశీలించిన ఆయన, చేరుకోవలసిన లక్ష్యాలపై తగు సూచనలు చేశారు. కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరగాలని, ప్రజలకు అందుతున్న సేవలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య మహిళా క్లినిక్‌ల ద్వారా మహిళలకు ఉచితంగా పరీక్షలు మరియు చికిత్సలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా స్త్రీలలో సాధారణంగా కనిపించే రక్తహీనత, అధిక బరువు, క్యాన్సర్, హైపర్‌టెన్షన్, డయాబెటిస్, జననేంద్రియాల ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఉచిత పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. మహిళలందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని ఆయన సూచించారు. అలాగే ప్రతి ఉద్యోగి తమ ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ రాజు, డాక్టర్ మౌనిక, సిసి నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంగ్ల భాషపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచనలు**

**హన్మకొండ జిల్లా, కమలాపూర్, 17 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**





ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా, వినూత్న పద్ధతుల్లో బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిస్థితులను సమీక్షించారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు వివరాలను తెలుసుకుని ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆరవ, పదో తరగతుల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. బోధన విధానం, పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 'లెట్స్ ఎన్ రిచ్ ఇంగ్లీష్' పాఠ్యాంశ బోధనను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ఆంగ్ల భాషా ప్రావీణ్యంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధిస్తున్న తీరు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉండాలని, ప్రత్యేకించి ఆంగ్ల భాషలో పట్టు సాధించేలా దృష్టి పెట్టాలని సూచించారు. పదాల సరైన ఉచ్చారణ, అర్థ వివరణతో పాటు ఆంగ్ల పదాలను తెలుగులో సరిగ్గా అనువదించి బోధించాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు చదివినది అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. తదుపరి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అన్ని తరగతులను పరిశీలించి ఐదో తరగతి విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడించి వారి పఠన నైపుణ్యాలను పరీక్షించారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, వంటగది, మరుగుదొడ్ల నిర్మాణ స్థితిని పరిశీలించారు. అసంపూర్తిగా, నిరుపయోగంగా ఉన్న నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వాటి వివరాలపై రెండు రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)ను ఆదేశించారు. క్లాస్‌రూమ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థులను బయట కూర్చోబెట్టడం సరికాదని హెచ్చరించిన కలెక్టర్, పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా, సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, ఆహార నాణ్యతపై కూడా ఆమె ఆరా తీశారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో గుండె బాబు, ఎంఈఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు వాణి, ఉపాధ్యాయులు అనిల్, జెకే నాయుడు, సంధ్య, చారి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ క్యాబినెట్ సమావేశం 23న.. రైతుభరోసా నిధులపై చర్చ

**జై భీమ్ న్యూస్, హైదరాబాద్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 23న తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ మీటింగ్‌లో అసెంబ్లీ బడ్జెట్ సెషన్లపై నిర్ణయం తీసుకోవచ్చు. మున్సిపల్ ఎన్నికల అనంతరం రైతుభరోసా నిధులను విడుదల చేస్తామని సీఎం ప్రకటించిన సందర్భంలో.. ఈ సమావేశంలో ఆ విషయంపై చర్చించి డెసిషన్ తీసుకోనున్నట్లు సమాచారం. భేటీలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల ఫిక్సేషన్ లాంటి అంశాలపై కూడా డిస్కషన్ జరిగే అవకాశం ఉంది. మార్చి 2 నుంచి జూన్ 2 వరకు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను మంత్రివర్గం చర్చించి ఆమోదం తెలపనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వివిధ డిపార్ట్‌మెంట్లు తమ వంద రోజుల ప్లాన్లను సిద్ధం చేస్తున్నాయి. రెండో దశ ఇందిరమ్మ ఇళ్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులు మొదలైన అంశాలపై కూడా చర్చ జరగవచ్చు.

# మత్స్యకారులకు మోటార్ సైకిల్ విత్ ఐస్ బాక్స్‌ల మంజూరు

**దరఖాస్తులకు ఆహ్వానం.. జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి**

**వరంగల్, ఫిబ్రవరి 17, 2026 (జై భీమ్ న్యూస్)**



జిల్లాలో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో అర్హులైన మత్స్యకారులకు మోటార్ సైకిల్ విత్ ఐస్ బాక్స్ యూనిట్లను మంజూరు చేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పథకం ద్వారా చేపల నిల్వ మరియు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, మత్స్యకారులకు ఆర్థికంగా లాభం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. జిల్లాకు మొత్తం 19 యూనిట్లు మంజూరు చేయబడుతున్నాయని, అందులో జనరల్ వర్గానికి 13 యూనిట్లు 40 శాతం సబ్సిడీతో అందించబడతాయని తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 60 శాతం సబ్సిడీతో యూనిట్లు ఇవ్వబడతాయని పేర్కొన్నారు. ఒక్కో యూనిట్ మొత్తం వ్యయం రూ.75,000 కాగా, సబ్సిడీ మినహాయించిన మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పడవ యజమానులు అయి ఉండాలని, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు తదితర అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని అధికారులు సూచించారు. అర్హులైన మత్స్యకారులు అవసరమైన పత్రాలతో జిల్లా మత్స్యశాఖ కార్యాలయం, ములుగు రోడ్, వరంగల్‌లో ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి కోరారు. జిల్లాలోని అర్హులైన మత్స్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**వరంగల్, 17 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గ్రామ పాలన అధికారులు మరియు ఇతర సిబ్బందిని సహాయకులుగా నియమించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మ్యాపింగ్ ప్రక్రియను ఖచ్చితంగా నిర్వహించాలని, పర్యవేక్షకులు, ఏఈఆర్ఓలు వారికి మార్గదర్శనం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె. నారాయణ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, పరకాల, హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు విజయలక్ష్మి, రవీందర్ రెడ్డి, రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.






# కన్నీరు పెట్టుకున్న ఎర్రబెల్లి దయాకర్ రావు

**తొర్రూరు చైర్మన్ ఎన్నికపై తీవ్ర ఆవేదన**

**తొర్రూరు, ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



తొర్రూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నిర్వహణపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ ఆయన భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను 45 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నానని, తన రాజకీయ జీవితంలో ఇంతటి మోసం, దగా ఎప్పుడూ చూడలేదని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కక్షసాధింపు రాజకీయాలు చూస్తుంటే రాజకీయాల్లో కొనసాగాలా లేదా అన్న భావన కలుగుతోందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కూడా ఇంత ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించలేదని ఆయన పేర్కొన్నారు. ప్రజలు మాకు పట్టం కడితే ప్రభుత్వం అన్యాయం చేసిందని, తనను మరియు తన భార్యను ఎందుకు అరెస్ట్ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొర్రూరులోని తన కార్యాలయానికి కూడా వెళ్లనివ్వలేదని, చైర్మన్ ఎన్నికలను అప్రజాస్వామికంగా నిర్వహించారని ఆరోపించారు. విప్ జారీ చేయాల్సిన తనను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని చెప్పారు. అదేవిధంగా, మున్సిపాలిటీలో తమ అభ్యర్థులకు కోట్ల రూపాయల ఆశ చూపినా తమ కౌన్సిలర్లు లొంగలేదని ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# ఒకే రోజులో రెండు కీలక మ్యాచ్‌లు ఆడి చారిత్రాత్మక విజయం సాధించిన తార్నాక జర్నలిస్టుల జట్టు



**హైద్రాబాద్, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ఒకే రోజులో సెమీ ఫైనల్, ఫైనల్ వంటి రెండు అత్యంత కీలక మ్యాచ్‌లను ఆడి అద్భుత విజయాన్ని సాధించిన తార్నాక జర్నలిస్టుల క్రికెట్ జట్టు క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. కఠినమైన పోటీ, శారీరక అలసట, సమయ ఒత్తిడి వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, జట్టు సభ్యులు అసాధారణ ధైర్యం, పట్టుదలతో ఆడి విజేతలుగా నిలవడం అందరి ప్రశంసలను అందుకుంది. టోర్నమెంట్‌లో సెమీ ఫైనల్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా సాగింది. జట్టు సభ్యులు సమన్వయంతో ఆడుతూ ప్రత్యర్థి జట్టుపై ఆధిపత్యం చాటుకున్నారు. సెమీ ఫైనల్ విజయం సాధించిన వెంటనే తక్కువ విరామంతోనే ఫైనల్ మ్యాచ్ ఆడాల్సిన పరిస్థితి వచ్చినప్పటికీ, ఆటగాళ్లు అలసటను లెక్కచేయకుండా మైదానంలో పూర్తి నిబద్ధతతో పోరాడారు. రాజు, బరిగెల శివ, రవి సహా మిగిలిన జర్నలిస్టులందరూ వ్యక్తిగత ప్రతిభకంటే సమిష్టి ఆటకే ప్రాధాన్యం ఇస్తూ జట్టు స్ఫూర్తితో ఆడటం ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. ప్రతి ఆటగాడు తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తూ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో చురుకుదనాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా ఒత్తిడి సమయంలోనూ సమయోచిత నిర్ణయాలు తీసుకోవడం జట్టును విజయ తీరాలకు చేర్చింది. శారీరక అలసట, వేడి వాతావరణం, వరుసగా మ్యాచ్‌లు ఆడాల్సిన పరిస్థితులు ఉన్నప్పటికీ ఒక్క అడుగు వెనక్కి వేయకుండా పోరాడిన ఈ జర్నలిస్టుల జట్టు నిజమైన క్రీడా స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది. "పోరాటమే లక్షణం" అనే భావాన్ని తమ ఆటతీరుతో మరోసారి నిరూపించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడడం ప్రత్యేకతను సంతరించుకుంది. జర్నలిస్టుల మధ్య ఐక్యతను పెంపొందించడం, క్రీడల పట్ల ఆసక్తిని పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ టోర్నమెంట్ నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ విజయంతో తార్నాక జర్నలిస్టుల జట్టు క్రీడా వేదికపై విశేష గుర్తింపు పొందడమే కాకుండా, జర్నలిస్టుల మధ్య ఐక్యత, క్రమశిక్షణ, జట్టు భావన ఎంత ముఖ్యమో మరోసారి చాటిచెప్పింది. పాల్గొన్న ఆటగాళ్లకు పలువురు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వల్భాపూర్‌కు దాతృత్వం

**ఫర్నిచర్ పంపిణీ**



**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల సౌకర్యాలను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో దాతలు ముందుకు రావడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వల్భాపూర్‌కు మాదంశెట్టి నాగరాజు అనే దాత రూ.10 వేల విలువ గల టేబుల్స్, కుర్చీలు, స్టూల్‌లను అందజేశారు. ఈ ఫర్నిచర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల సిబ్బంది తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ బోయినపల్లి మహేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సహకారం ఎంతో ముఖ్యమని, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా దాత మాదంశెట్టి నాగరాజు తండ్రి మాదంశెట్టి ఉపేందర్‌ను అతిథులు ఘనంగా సన్మానించి, పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎవీపీసీ చైర్మన్ నీరజ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో కూడా సహకారం అందించాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

# ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్.. నేడు పలువురు దేశాధినేతలతో మోడీ భేటీలు

**జై భీమ్ న్యూస్, హైదరాబాద్:**

భారత రాజధాని ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరుగుతోంది. ఈ సమ్మిట్‌కు దాదాపు 20 దేశాల అధినేతలను భారత్ ఆహ్వానించింది. ఇప్పటికే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో పాటు పలువురు దేశాధినేతలు భారత్‌కు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ నేడు పలు దేశాల నాయకులతో భేటీలు జరపనున్నారు. బుధవారం మోడీ షెడ్యూల్ బిజీగా ఉంది. ప్రధాని మోడీ నేడు హైదరాబాద్ హౌస్‌లో జరిగే సమావేశాల్లో స్పెయిన్, ఫిన్లాండ్, సెర్బియా, క్రొయేషియా, ఎస్టోనియా, భూటాన్, కజకిస్తాన్ దేశాల అగ్రనాయకులతో విడివిడిగా చర్చలు జరపనున్నారని వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ ప్రకారం స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్, ఫిన్లాండ్ ప్రధాని ఆంటి పెట్టేరి ఓర్పో, సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుచిక్, క్రొయేషియా ప్రధాని ఆంద్రేజ్ ప్లెన్కోవిక్, ఎస్టోనియా అధ్యక్షుడు అలార్ కారిస్, భూటాన్ ప్రధాని దాషో షెరింగ్ టోబ్గే, కజకిస్తాన్ ప్రధాని ఓల్జాస్ బెక్టెనోవ్‌లతో మోడీ సమావేశమవుతారు. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఇప్పటికే భారత్‌లో ఉన్నారు. వ్యూహాత్మక సహకారం, సాంకేతికత, వాణిజ్యం వంటి అంశాలపై ప్రధాని మోడీతో చర్చలు జరిపారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా కూడా శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంతర్జాతీయ సహకారం, సాంకేతిక పురోగతి, భవిష్యత్ సవాళ్లపై చర్చలు జరగనున్నాయి.

# సర్పంచుల పాత్ర గ్రామాల అభివృద్ధికి కీలకం

**- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**





**వరంగల్ జిల్లా / గీసుకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

గ్రామాల సర్వతోముఖాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. దేశంలోనే ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో జిల్లాలోని 11 మండలాలకు చెందిన నూతన సర్పంచుల కోసం నాలుగు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన రెండవ విడత శిక్షణలో భాగంగా రాయపర్తి, నర్సంపేట, ఖనాపూర్, దుగ్గొండి మండలాలకు చెందిన సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, గ్రామాలకు మంచి జరగాలంటే సర్పంచులు పంచాయతీ రాజ్ చట్టం--2018పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ శిక్షణ తరగతుల ప్రధాన ఉద్దేశం అన్ని ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కల్పించడం, గ్రామ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించే విధానాలను తెలియజేయడమేనని ఆమె తెలిపారు. శిక్షణలో గ్రామ పంచాయతీల పనుల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. సర్పంచులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. డిజిటల్ గవర్నెన్స్‌కు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ పని చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ గీసుకొండ మండలంలోని అరేపల్లి, ఎలుకుర్తి గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఎలుకుర్తిలో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రోత్సహించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, పాఠశాలల నిర్వహణ, పారిశుధ్య పరిస్థితులు, మౌలిక వసతులు, లైన్ డిపార్ట్మెంట్ల పనితీరును సమీక్షించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రామ్ రెడ్డి, డీపీఓ కల్పన, డీఈఓ రంగయ్య నాయుడు, డీఎంహెచ్ఓ సాంబశివ రావు, డీడబ్ల్యూఓ రాజమణి సహా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎఫ్‌సీఆర్ఐ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ



**సిద్దిపేట జిల్లా, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ములుగు లోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్.సి.ఆర్.ఐ)లో 10వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారిణి డాక్టర్ సి. సువర్ణతో కలిసి కళాశాల ఆవరణంలో మొక్క నాటారు. విద్యార్థులు చెట్ల నుంచి తయారు చేసిన పలు ఉత్పత్తులను ప్రదర్శించి, రుచి చూశారు. అనంతరం ఆర్టీఐ చీఫ్ కమిషనర్ జి. చంద్రశేఖర్ రెడ్డి ఇతర అటవీ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, పది సంవత్సరాల్లో ఎఫ్‌సీఆర్ఐ తెలంగాణ హరితాభివృద్ధికి కీలక వేదికగా ఎదిగిందన్నారు. అడవుల పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ, జీవ వైవిధ్య సంరక్షణలో నైపుణ్యం కలిగిన యువతను తయారు చేయడంలో సంస్థ ముందంజలో ఉందని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు, పరిశోధన, మౌలిక వసతులు గణనీయంగా అభివృద్ధి చెందాయని ప్రశంసించారు. ఖాళీ అధ్యాపక పోస్టుల భర్తీ, సీనియర్ ఫ్యాకల్టీ నియామకం, మౌలిక వసతుల బలోపేతంపై ప్రతిపాదనలు పంపాలని, వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమై ఫారెస్ట్రీలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించారు. ఆర్టీఐ చీఫ్ కమిషనర్ జి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఎఫ్‌సీఆర్ఐ బలోపేతానికి పలు సూచనలు చేశారు. బి.ఎస్సి (ఫారెస్ట్రీ) ప్రవేశాల్లో ఇంటర్ మార్కులు, ఈఏపీసెట్ ర్యాంక్‌కు సముచిత ప్రాధాన్యం కల్పించేలా అర్హత ప్రమాణాలను పునర్విమర్శించాలని సూచించారు. ఫారెస్ట్రీ పట్టభద్రులకు ఎఫ్‌బీఓ పోస్టుల్లో ప్రత్యేక రిజర్వేషన్ కోటా సాధ్యం కాదని స్పష్టం చేశారు. బోధనా సిబ్బందికి సిఏఎస్ అమలు చేయాలని, పరిపాలన, అకాడమిక్, పరిశోధన రంగాల్లో సమగ్ర సంస్కరణల కోసం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. అటవీ దళాల అధిపతి డాక్టర్ సి. సువర్ణ మాట్లాడుతూ, 2016లో స్థాపితమైన ఎఫ్‌సీఆర్ఐ పది సంవత్సరాల్లోనే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఫారెస్ట్రీ విద్యాసంస్థగా ఎదిగిందన్నారు. బి.ఎస్సి (హానర్స్) ఫారెస్ట్రీతో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం ఎం.ఎస్సి, పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తూ ఐసిఏఆర్ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధన కొనసాగిస్తున్నదన్నారు. విద్యార్థులు ఐఎఫ్ఎస్, గ్రూప్--1, గ్రూప్--3 వంటి పోటీ పరీక్షల్లో విజయాలు సాధించడం గర్వకారణమన్నారు. కళాశాల డీన్ ఐఎఫ్ఎస్ అధికారి కృష్ణ సంస్థ గత పది సంవత్సరాల ప్రగతిని వివరించారు. ఇప్పటివరకు 300కిపైగా విద్యార్థులు పట్టభద్రులై, 35 పరిశోధన ప్రాజెక్టులు పూర్తిచేసినట్లు తెలిపారు. ఖాళీ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ, స్టైపెండ్ పెంపు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి రాజారాం రెడ్డి, సీసీఎఫ్‌లు ప్రియాంక వర్గీస్, ఎస్.జే. ఆశా, ఏసీఎఫ్ కవిత, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



# హాస్టల్ భోజన నాణ్యతపై విద్యార్థుల ఆందోళన

**అస్వస్థత ఘటనతో కలకలం**

**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ మండలంలోని జయగిరిలో ఉన్న విద్యార్థి హాస్టల్‌లో అందిస్తున్న భోజన నాణ్యతపై విద్యార్థులు ఆందోళనకు దిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ నెల 14వ తేదీ రాత్రి హాస్టల్‌లో భోజనం చేసిన అనంతరం పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. కొందరికి వాంతులు, జ్వరం, అలసట వంటి లక్షణాలు కనిపించడంతో హాస్టల్ సిబ్బంది అప్రమత్తమై వెంటనే వైద్యులను పిలిపించి ప్రాథమిక చికిత్స అందించారు. అయితే కొంతమంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వారిని సమీప ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించినట్లు తెలిసింది. ప్రస్తుతం చికిత్స పొందిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనకు కారణం హాస్టల్‌లో అందిస్తున్న భోజనం నాణ్యతలేమేనని విద్యార్థులు ఆరోపించారు. భోజనంలో పరిశుభ్రత పాటించడం లేదని, ఆహార పదార్థాలు తగిన ప్రమాణాలకు అనుగుణంగా లేవని వారు పేర్కొన్నారు. సమస్యపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆహార నాణ్యతను సమగ్రంగా పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఘటనపై సమాచారం అందుకున్న సంబంధిత శాఖ అధికారులు హాస్టల్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భోజన సరఫరా విధానం, నిల్వ ఉంచుతున్న ఆహార పదార్థాలు, వంటగది పరిశుభ్రత తదితర అంశాలపై ప్రాథమికంగా పరిశీలన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకున్నామని, భోజన సరఫరాపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించి నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్‌లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం ప్రభుత్వానికి ప్రాధాన్యతనిచ్చే అంశమని, హాస్టల్‌ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు హెచ్చరించారు.

# పాఠశాలల్లో ఆరోగ్య శిబిరం పర్యవేక్షించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య

**హన్మకొండ, 17 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**





జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య హసన్‌పర్తి ఆర్‌బిఎస్కే--ఏ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల ఆరోగ్య శిబిరాలను మంగళవారం పర్యవేక్షించారు. మచిలీ బజార్ ప్రాంతంలోని గవర్నమెంట్ హై స్కూల్, తౌజండ్ పిల్లర్స్ టెంపుల్ ఉర్దూ మీడియం పాఠశాల, గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ తౌజండ్ పిల్లర్స్ తదితర విద్యాసంస్థల్లో ఈ ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు కంటి పరీక్షలు (ఐ స్క్రీనింగ్), దంత పరీక్షలు (డెంటల్ స్క్రీనింగ్), చిన్నపాటి వ్యాధులకు చికిత్స అందించారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు ఐరన్ మరియు ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, ప్రతి విద్యార్థి ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే డీఈఐసీ (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్) కు రిఫర్ చేసిన విద్యార్థులకు తగిన ఫాలోఅప్ సేవలు అందించాలని ఆర్‌బిఎస్కే బృందాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ దివ్య, ఫార్మసీ ఆఫీసర్ మాధురి, స్వరూపా సిస్టర్, ఆర్‌బిఎస్కే టీం సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఫాతిమా నిస్రత్, పి. అమరావతి, రఫత్ సుల్తానా, అజీజ్ ఫాతిమా, ఎం. శ్యాంసుందర్ మరియు ప్రాథమిక పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు కూడా శిబిరంలో పాల్గొన్నారు. ఆరోగ్య పరీక్షల ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించి చికిత్స అందించడం ఈ శిబిరాల ప్రధాన ఉద్దేశమని వైద్య అధికారులు తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE



# ఈ రోజుల్లో ప్రేమకు అతి పెద్ద సవాలు ఇదే!: మృణాల్ ఠాకూర్

ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రేమ సంబంధాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ 'కమ్యూనికేషన్' అని ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్ అన్నారు. తన రాబోయే చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతర్జాలం, సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక అంతులేని అవకాశాల వల్ల సంబంధాలలో అలసట పెరిగిపోయిందని, దీనివల్ల ప్రేమ బంధాలు కూడా పెళుసుబారిపోయాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక నటిగా తన వృత్తి జీవితంలోని సవాళ్ల గురించి కూడా మృణాల్ పంచుకున్నారు. "కొన్నిసార్లు మేము పోషించే పాత్రల కోసం ప్రతికూల మానసిక స్థితిలో ఉండాల్సి వస్తుంది. ఆ ప్రభావం మనకు తెలియకుండానే మన భాగస్వామి, కుటుంబ సభ్యులు లేదా స్నేహితులపై పడొచ్చు. అందుకే, ఒక నటిగా నేను నా పాత్రలను ఇంటికి తీసుకురాకుండా ఉండేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తాను. ఇది అంత సులభం కాదు" అని ఆమె వివరించారు. ఈ సందర్భంగా పాతతరం ప్రేమకథల్లోని మాధుర్యాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు. "ఒకసారి నేను అభిమన్యు దసాని తల్లి, ప్రముఖ నటి భాగ్యశ్రీ గారితో సమయం గడుపుతున్నప్పుడు ఆమె తన ప్రేమకథ గురించి చెప్పారు. వారంలో ఒకే ఒక్క ఫోన్ కాల్ కోసం ఆమె పీసీఓ వద్ద ఎదురుచూసేవారట. సిగ్నల్ లేని చోట ఆ ఒక్క కాల్ కోసం పడిగాపులు కాసేవారట. ఆ రోజుల్లో ఒకరి సమయానికి, మాటకు ఎంతో విలువ ఉండేది. కానీ ఇప్పుడు కమ్యూనికేట్ చేయడానికి ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ఆనాటి నిరాడంబరమైన ప్రేమలో ఉన్న స్వచ్ఛత, విలువ తగ్గిపోయాయి. ఆ పాత రోజుల్లోని ప్రేమే బాగుండేది" అని మృణాల్ అన్నారు. ఇక 'దో దీవానే షెహర్ మే' చిత్ర విషయానికొస్తే, ఇందులో సిద్ధాంత్ చతుర్వేది, సందీపా ధర్, అయేషా రజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, భన్సాలీ ప్రొడక్షన్స్, సంజయ్ లీలా భన్సాలీ, ప్రేరణా సింగ్, ఉమేష్ కుమార్ బన్సల్, భరత్ కుమార్ రంగా కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి ఉద్యవార్ ఫిల్మ్స్‌తో కలిసి ఈ సినిమాను సమర్పిస్తున్నారు. ఈ చిత్రం 2026, ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# సినీ నటి ప్రత్యూష మృతి కేసులో తీర్పు

ప్రముఖ టాలీవుడ్ సినీ నటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పును వెలువరించింది. రెండు దశాబ్దాలకు పైగా నడుస్తున్న ఈ కేసులో జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం కీలక తీర్పును వెలువరించింది. సిద్ధార్థరెడ్డి పిటిషన్‌ను కొట్టివేస్తూ, నాలుగు వారాల్లో లొంగిపోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. సినీ నటి ప్రత్యూష 2002 ఫిబ్రవరి 23న మృతి చెందారు. ఈ కేసులో నిందితుడు సిద్ధార్థరెడ్డికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సిద్ధార్థరెడ్డి హైకోర్టులో సవాల్ చేయడంతో జైలు శిక్షను రెండేళ్లకు కుదించింది. హైకోర్టు తీర్పును ప్రత్యూష తల్లి సరోజిని సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. మరోవైపు, శిక్షను రద్దు చేయాలని సిద్ధార్థరెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ఇరువైపుల వాదనలు విన్నది. గత ఏడాది నవంబర్‌లో విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు, తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసుకు సంబంధించి 24 ఏళ్ల తర్వాత ఈరోజు తీర్పును వెలువరిస్తూ, సిద్ధార్థరెడ్డిని లొంగిపోవాలని ఆదేశించింది. 2002లో తాను, ప్రత్యూష పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించామని, తాను ఆసుపత్రిలో చికిత్స పొందడంతో ప్రాణాలతో బయటపడ్డానని సిద్ధార్థరెడ్డి చెబుతున్నారు. తన కూతురు ఆత్మహత్యకు సిద్ధార్థరెడ్డి కారణమని సరోజిని ఆరోపించారు.



# నిర్మాతగా మారిన నిత్యా మీనన్

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జాతీయ అవార్డు గ్రహీత, నటి నిత్యా మీనన్ నిర్మాతగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. 'కీయురి ప్రొడక్షన్స్' పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను మంగళవారం ప్రకటించారు. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా వెల్లడిస్తూ, ప్రొడక్షన్ హౌస్ లోగో వీడియోను పంచుకున్నారు. సినిమాలు తీయడమంటే కేవలం కథలు చెప్పడం మాత్రమే కాదని, మనుషులను లోతైన స్థాయిలో స్పృశించడం అని ఆమె పేర్కొన్నారు. "నటన ప్రారంభించిన తొలిరోజు నుంచి నా ఉద్దేశం ఇదే. ఇప్పుడు నిర్మాతగా కూడా అదే ఉద్దేశంతో కొనసాగుతాను. నాలోని సృజనాత్మక ప్రక్రియ ద్వారా, చూసేవారిలో ఒక పరివర్తన తీసుకురావడమే నా లక్ష్యం" అని తన పోస్టులో వివరించారు. భూమి గుహల నుంచి పుట్టి, రాతితో చెక్కబడిన, కాంతిని ప్రేమించే రూపం లేనిదే 'కీయురి' అని ఆమె వీడియోలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన తొలి తెలుగు చిత్రం 'అలా మొదలైంది' 15 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పటి జ్ఞాపకాలను కూడా నిత్యా గుర్తుచేసుకున్నారు. అప్పట్లో తాము తీస్తున్న రొమాంటిక్ కామెడీని ఎవరూ అర్థం చేసుకోలేదని, షూటింగ్ తర్వాత ఇరానీ చాయ్ తాగుతూ సమయం గడిపేవాళ్లమని తెలిపారు. షూటింగ్ సమయంలో దర్శకురాలు నందిని రెడ్డి తనతో, "ఇకపై నువ్వు ఇలా స్వేచ్ఛగా రెస్టారెంట్లోకి వెళ్లలేవు" అన్నారని, ఆ మాటలు తనకు అప్పట్లో వింతగా అనిపించాయని చెప్పారు. చిన్న సినిమాలు చేసుకుంటూ స్వేచ్ఛగా ఉండాలనుకున్న తన జీవితాన్ని 'అలా మొదలైంది' పూర్తిగా మార్చేసిందని, ఇప్పుడు నిర్మాతగా అదే స్ఫూర్తితో ముందుకు వెళుతున్నానని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.